నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 20 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

మెనూ తప్పక పాటించాలి

భద్రాద్రి కలెక్టర్, ఇన్‌చార్జ్ పీవో జితేశ్ వి పాటిల్

భద్రాచలం : హెచ్ఎం సుభద్రతో మాట్లాడుతున్న కలెక్టర్, ఇన్‌చార్జ్ పీవో జితేశ్ వి పాటిల్

భద్రాచలం/చర్ల, జూన్ 19 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భద్రాద్రి కలెక్టర్, ఇన్‌చార్జ్ పీవో జితేశ్ వి పాటిల్ అన్నారు. బుధవారం భద్రాచలం పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ఇళ్ల నుంచి ఆశ్రమ పాఠశాలలకు వచ్చే విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులను గమనించాలని హెచ్ఎంలు, వార్డెన్లకు సూచించారు. వాతావరణ మార్పులతో ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. వర్షాకాలం సీజన్ కావడంతో పిల్లలు రాత్రిపూట బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. పాఠశాల నిర్వహణ తీరు బాగున్నదని, ప్రతి రోజు ఇలాగే పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం చర్ల మండలంలో పర్యటించిన కలెక్టర్ ముంపు గ్రామం దండుపేట సమీపంలోని తాలిపేరు వంతెన వద్ద పరిశీలించారు. వరద పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముంపు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించే తేగడ రైతు వేదిక భవనం వద్ద ఆగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవరపల్లిలోని ఆదర్శ పాఠశాలను సందర్శించి.. ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో దామోదర్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో నరసింహారావు, తహసీల్దార్లు శ్రీనివాస్, మొగిలి శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం సుభద్ర, సీడీపీవో చైతన్య, ఆర్ఐ వరలక్ష్మి, ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు మారుపేరు ఎన్‌సీసీ

పాలేరు నవోదయలో క్యాంపులో పాల్గొన్న తెలంగాణ, ఏపీ డీడీజీ డైరెక్టర్ ఎయిర్ కమోడోర్ ఎంవీ రెడ్డి

డీడీజీ డైరెక్టర్ ఎయిర్ కమోడోర్ ఎంవీ రెడ్డి

కూసుమంచి, జూన్ 19 : క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరు ఎన్‌సీసీ అని, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలంగాణ, ఏపీ డీడీజీ డైరెక్టర్ ఎయిర్ కమోడోర్ ఎంవీ.రెడ్డి అన్నారు. పాలేరులోని నవోదయ విద్యాలయలో తెలంగాణలోని ఐదు జిల్లాలకు చెందిన 560 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లకు 10 రోజులపాటు నిర్వహించే 11(టీ)బీఎన్ సీఏసీటీ-IV ఎన్‌సీసీ క్యాంపు బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంవీ రెడ్డి మాట్లాడుతూ పది రోజులపాటు ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైరింగ్, వికాసం, డ్రిల్, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, సాంస్కృతిక అంశాల్లో నిర్వహించే కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 28 వరకు జరిగే శిక్షణలో ఎన్‌సీసీ ప్రాధాన్యతలను కూడా వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కల్నల్ సచిన్ నింబాల్కర్, వీఆర్‌సీ, జీపీ సీడీఆర్ ఏసీసీ వరంగల్, ఏడీ సికింద్రాబాద్ కల్నల్ సంజైగుప్తా, కల్నల్ సంజీవద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో సమానత్వం

విద్యాశాఖ సమీక్షలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా చొరవ తీసుకోవాలి
- విద్యాశాఖ సమీక్షలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, జూన్ 19: విద్యతోనే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. విద్యారంగానికి తొలి ప్రాధాన్యమిస్తామని అన్నారు. ఖమ్మంలోని ఐడీవోసీలో విద్యాశాఖపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషిచేస్తోందని, పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తోందని అన్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం వంటివి అందిస్తోందని అన్నారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెరిగేలా చొరవ తీసుకోవాలని, ఒకవేళ విద్యార్థులు గైర్హాజరైతే అందుకు కారణాలు తెలుసుకోవాలని, తరచూ గైర్హాజరయ్యే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో చర్చించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు కూడా అంతే ముఖ్యమని, సమయ పాలన తప్పక పాటించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం)కు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు సోమశేఖరశర్మ, వై.రాజశేఖర్, కే.రవికుమార్, రామకృష్ణ, భూలక్ష్మి, భానుప్రకాశ్, పాపారావు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

- 'ప్రజాపాలన'లో మొదట ఆమోదం పొందిన మీటర్లకే జీరో బిల్లులు
- అందులోనూ అనేక తప్పిదాలు.. ఫలితంగా అర్హత కోల్పోయిన అర్హులు
- మళ్లీ నమోదుకు ఆదేశాలు, ఎడిట్‌కు ఆప్షన్లు ఇవ్వని పాలకులు
- కాగితాలతో కార్యాలయాల చుట్టూ 'కరెంటు' దరఖాస్తుదారులు

పాల్వంచ మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజాపాలన పత్రాలు అందిస్తున్న దరఖాస్తుదారులు (ఫైల్)

'గృహజ్యోతి' అన్నారు..

గుణపాఠం చెప్పారు..

పాల్వంచ, జూన్ 19 : 'ఆరు గ్యారెంటీలు అన్నారు.. అరచేతిలో వైకుంఠం చూపారు.. తీరా చూస్తే అర్హతను అడుగున పడేశారు. అదేమిటని అడిగితే.. ఆప్షన్లు లేవని చల్లగా చెబుతున్నారు.. గృహజ్యోతి అంటూ మాకు సరైన గుణపాఠమే చెప్పారు..' ఇదీ.. జీరో బిల్లులు రాని అర్హులైన పేదల ఆవేదన. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 'మాది ప్రజాపాలన' అంటూ పరుగులు పెట్టారు ఆ పార్టీ పాలకులు. ఎన్నికలప్పుడు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో అర హామీని కూడా ఆగనీయబోమంటూ హడావిడి చేశారు. వెనువెంటనే 'ప్రజాపాలన' అంటూ గ్రామసభలు పెట్టారు. ఆరు గ్యారెంటీలకు అర్హులైన ప్రజలంతా దరఖాస్తు చేసుకోవాలంటూ ఊదరగొట్టారు. అంతా నిజమేనని నమ్మిన.. అసలైన అర్హులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి అర్హతగల వాటికి దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా 'గృహజ్యోతి' కోసం వెల్లువలా దరఖాస్తులు చేసుకున్నారు. 'నెలకు 200 యూనిట్లలోపు వినియోగిస్తే సొంతింట్లో ఉన్న వాళ్లకు, అద్దెంట్లో ఉన్న వాళ్లకు ఉచితంగా కరెంటు' అని ఊరూరా ప్రచారం చేయడంతో అర్హులందరూ తమ విద్యుత్ మీటర్ల వివరాలు, రేషన్ కార్డుల నంబర్లు, ఆధార్, నివాస వంటి ధ్రువీకరణ పత్రాలను గ్రామసభల్లో అందజేశారు. వాటన్నింటినీ తీసుకెళ్లిన అధికారులు.. వివరాలను క్రోడీకరించుకొని అన్నింటినీ ఆన్‌లైన్ చేశారు. కానీ.. ఇక్కడే అసలు అలక్ష్యం బయటపడింది. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేటప్పుడు చాలామంది దరఖాస్తుదారుల వివరాలు తప్పుగా ఎంటర్ చేశారు. దీంతో అర్హులైన ఎంతోమంది అనర్హులుగా మిగిలిపోయారు. దీంతో ఆ తరువాతి నుంచి వారికి జీరో బిల్లు రావడం లేదు. ఉచిత కరెంటు వర్తించనందున బిల్లు మొత్తం చెల్లించాల్సిందేనంటూ విద్యుత్ సిబ్బంది ఇళ్లకొచ్చిమరీ చెప్పి వెళ్తున్నారు. దీంతో లబోదిబోమంటూ దరఖాస్తుదారులంతా ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు తీశారు. పరుగున వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పోటెత్తడంతో, పత్రికల్లో కథనాలు రావడంతో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి ఎట్టకేలకు స్పందించారు. అర్హత ఉన్నప్పటికీ జీరో బిల్లు రాకపోతే ఆందోళన చెందవద్దని, తాము సరిచేసేలోపు బిల్లు లెవరూ చెల్లించాల్సిన అవసరం లేదని సెలవిచ్చారు. ఆ మాట విని కూడా ఆరు నెలలు దాటిపోయింది. ఇప్పటికీ అర్హులకు న్యాయం జరిగింది లేదు. ఉచిత విద్యుత్ ఇచ్చింది లేదు. దీంతో ఏ నెలకు ఆ నెల విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోతుండడంతో దరఖాస్తుదారుల గుండెల్లో భారం పెరిగిపోతోంది. ఇన్నాళ్లూ ఎన్నికల కోడ్ పేరుతో కాలయాపన చేసిన పాలకులు.. ఇప్పటికీ గృహజ్యోతి పెండింగ్ దరఖాస్తులపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న దరఖాస్తుదారులు తమకు వచ్చిన బిల్లులను, తమ అర్హతల కాగితాలను చేతపట్టుకొని కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. బిల్లులతో బారులు తీరినా తామేమీ చేయలేమని, ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇస్తే తప్ప ప్రక్రియ ముందుకు కదిలే పరిస్థితి లేదని అధికారులు తెగేసి చెబుతున్నారు. అయితే వచ్చిన వారు నిరాశతో వెనక్కి వెళ్లకుండా తాము దరఖాస్తులు తీసుకుంటామని, కానీ.. సర్కారు సందేశం వస్తేనే సమస్యపై స్పందిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందుకోసం ఆయా కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అర్హులు వస్తున్నారు. అన్ని వివరాలతో కూడిన అర్జీలు అందజేస్తున్నారు. అయోమయంతో వెనుదిరుగుతున్నారు. ఈ చిత్రం కూడా అందుకు సంబంధించినదే. జీరో బిల్లులు రానివారంతా మళ్లీ దరఖాస్తులు అందించాల్సిందేనని అధికారులు చెప్పడంతో అన్ని కాగితాలనూ పట్టుకొని పరుగు పరుగున వస్తున్నారు పాల్వంచ పట్టణంలోని దరఖాస్తుదారులు. ఇక్కడి మున్సిపాలిటీ కార్యాలయంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసిన పుర పాలక అధికారులు.. దరఖాస్తులు తీసుకొని ప్రజలను పంపించివేస్తున్నారు. 'గృహజ్యోతి అంటూ ఈ కాంగ్రెసోళ్లు సరైన గుణపాఠమే చెప్పారు..' అని నిట్టూర్చుతూ వెనుదిరుగుతున్నారు దరఖాస్తుదారులు.

నేడు విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఖమ్మం సిటీ, జూన్ 19: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ మాలతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయసు వారికి 400 ఎంజీ ఆల్బెండజోన్ మాత్రలు అందిస్తామని అన్నారు. వారు వాటిని భోజనం తర్వాత మింగాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడే వారికి వీటిని ఇవ్వకూడదని సిబ్బందికి సూచించారు. ఈ మాత్రల కారణంగా పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధి ఉంటుందని, రక్తహీనత నుంచి రక్షించబడతారని వివరించారు. చదువుపై శ్రద్ధ, పాఠశాలల్లో హాజరు శాతం మెరుగుపడతాయని అన్నారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను, మూడు నుంచి 19 ఏళ్ల చిన్నారులకు ఒక పూర్తి మాత్రను ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.1,618 పాఠశాలల్లోని విద్యార్థులకు,1,840 అంగన్‌వాడీల్లోని చిన్నారులకు వీటిని అందించనున్నట్లు వివరించారు.

దివ్యాంగుల పింఛన్లు తక్షణమే పెంచాలి

- వెంటనే పెంపు ప్రకటన చేయకపోతే సీఎం ఇల్లు ముట్టడిస్తాం
- వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ అందె రాంబాబు

మాట్లాడుతున్న జాతీయ కోర్ కమిటీ చైర్మన్ అందె రాంబాబు

ఖమ్మం వ్యవసాయం, జూన్ 19: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్‌ను తక్షణమే పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ చైర్మన్ అందె రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంపు ప్రకటన వెలువడకుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సంఘం నేతల రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం జిల్లాకు వచ్చిన ఆ సంఘం బాధ్యులు.. వీహెచ్‌పీఎస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు సామినేని భవానీచౌదరి, రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ భవనంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అందె రాంబాబు మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే దివ్యాంగుల పింఛన్‌ను రూ.4 వేల నుంచి రూ 6 వేలకు; వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, బీడీ కార్మికుల పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఆ హామీ గురించి ముఖ్యమంత్రి రేంవంత్‌రెడ్డి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అలాగే, మహిళల మాదిరిగానే దివ్యాంగులకు కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. సంఘం నాయకులు చిట్టిరాజు, ఉపేందర్, భూలక్ష్మి, చెరుకునపల్లి శ్రీనివాస్, రాము, వీరబాబు, మల్లికార్జున్, ఉపేంద్రయ్య, గోపాల్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి వచ్చేశారు..

- ఎట్టకేలకు ప్రమోషన్లు పొందిన 954 మంది ఉపాధ్యాయులు
- సెల్ఫ్ రిపోర్టులు సమర్పించి కేటాయించిన పాఠశాలల్లో చేరికలు
- ఉదయమే అలాట్‌మెంట్లు.. సాయంత్రానికి జాయినింగ్‌లు..
- ట్రాన్స్‌ఫర్లకు దరఖాస్తు చేసుకోని టీచర్లకు మరో అవకాశం
- బదిలీల పూర్తితో హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా ఉపాధ్యాయులు

ఉద్యోగోన్నతుల ద్వారా వచ్చి ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో చేరుతూ సెల్ఫ్ రిపోర్ట్ చేస్తున్న టీచర్లు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 19 : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల ప్రక్రియ బుధవారం ముగిసింది. టీచర్ల అప్‌గ్రేడేషన్ తోపాటు ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు పొందే ప్రక్రియకు తెరపడినట్లయింది. ఉపాధ్యాయుల రెండు రోజుల ఎదురుచూపులకు మంగళవారం అర్ధరాత్రి ముగింపు లభించింది. అనంతరం ఉద్యోగోన్నతుల జాబితాను విద్యాశాఖ వెల్లడించింది. కోర్టు ఆదేశాలను పూర్తిస్థాయిలో పరిగణనలోకి తీసుకోకుండా నిర్వహించడం వల్ల ప్రక్రియలో కొంత జాప్యం జరిగినప్పటికీ చివరికి మాత్రం పరిసమాప్తమైంది. బుధవారం ఉదయమే వెబ్ కౌన్సెలింగ్ ద్వారా జరిపిన ప్రక్రియలో ప్రమోషన్ ద్వారా ఏ ఉపాధ్యాయుడికి ఏ పాఠశాల అలాట్ అయిందో అనే సమాచారం వచ్చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో పాఠశాలల సమయానికే అత్యధిక మంది పాఠశాలల్లో విధుల్లో చేరిపోయారు.

పాఠశాలల్లో సెల్ఫ్ రిపోర్ట్..

జిల్లాలో భాషా పండితులైన తెలుగు, హిందీ టీచర్లతోపాటు పీఈటీలు అప్‌గ్రేడ్ అయ్యాయి. అలాగే, ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు పొందారు. ప్రమోషన్ల అధీకృత అధికారి డీఈవో కావడంతో ఉపాధ్యాయులంతా ఆయన నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. వాటిని తీసుకెళ్లి నేరుగా తమకు అలాట్ అయిన పాఠశాలల్లో అందించి సెల్ఫ్ రిపోర్ట్ చేశారు. ఖమ్మం జిల్లాలో ప్రమోషన్లకు అర్హులైన ఉపాధ్యాయులు 954 మంది ఉన్నారు. వారిలో బుధవారం సాయంత్రానికి 901 మంది వారికి కేటాయించిన పాఠశాలల్లో రిపోర్ట్ చేసినట్లు విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. నూతన పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారు. రిజిస్టర్లలో సంతకాలు చేసి విధుల్లో నిమగ్నమయ్యారు. కాగా, విధుల్లో చేరిన ఉపాధ్యాయుల వివరాలను వారి సర్వీస్ రికార్డుల్లో నమోదు చేయనున్నారు. అలాగే, రిపోర్ట్ చేయని వారిలో ఇంకా 53 మంది మిగిలారు. వారిలో విదేశాల్లో ఉన్నవారు, హాస్పిటళ్లలో ఉన్న వారు ఉన్నారు. ఇందులో మరికొందరికి రెండు ప్రమోషన్లు రాగా.. వాటిల్లో వారు ఒక దానిలోనే రిపోర్ట్ చేసి మిగిలిన దానిని వదులుకున్నారు.

బదిలీలకు మరో అవకాశం..

గతంలో ఆన్‌లైన్ ద్వారా బదిలీలకు దరఖాస్తు చేసుకోని ఉపాధ్యాయులకు విద్యాశాఖ మరో అవకాశం కల్పించింది. 2024 జూన్ 1 నాటికి రెండేళ్ల సర్వీస్ పూర్తయిన ఉపాధ్యాయులతోపాటు 8 ఏళ్ల సర్వీస్ పూర్తయిన వారు తప్పనిసరిగా బదిలీకి అర్హులు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు బదిలీ కోసం తమ దరఖాస్తులను నేరుగా తమ కార్యాలయంలో అందజేయాలని విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ సూచించారు.

గ్రూప్-2 ఉచిత గ్రాండ్ టెస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 19: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్పీ) గ్రూప్-2 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి ఉచిత గ్రాండ్ టెస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ.శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు గ్రాండ్ టెస్టుల్లో 12 పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 19వ తేదీ నుంచి జూలై 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9573859598 నంబరులో సంప్రదించాలని కోరారు.

భద్రాద్రి రామాలయంలో రూ.200 టికెట్‌పై బ్రేక్ దర్శనం

భద్రాచలం, జూన్ 19 : ఆలయానికి అధిక ఆదాయాన్ని సమకూర్చాలనే ఉద్దేశంలో భాగంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో రూ.200 టికెట్‌పై భక్తులకు 'బ్రేక్ దర్శనం' జూలై 2వ తేదీ నుంచి కల్పించనున్నట్లు ఈవో ఎల్.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రేక్ దర్శనం సమయంలో ఉచిత, స్పెషల్ దర్శనం, అంతరాలయ అర్చనలను తాత్కాలికంగా నిలిపివేస్తారని, అయితే బ్రేక్ దర్శనం అవకాశం ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 7.30 గంటల వరకు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఈ నెల 22న జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా స్వామివారికి జ్యేష్ఠాభిషేకం అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 22న స్వామివారికి నిత్య కల్యాణం, తిరువీధి సేవ, పవళింపు సేవలు రద్దు చేశామని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

వాడిపోతున్న పత్తి మొక్కలు

- తిరుమలాయపాలెంలో నెర్రెలువారుతున్న పంట చేలు
- వరుణుడి కరుణ కోసం చూస్తున్న మండల కర్షకులు



తిరుమలాయపాలెం, జూన్ 19: ఈ ఏడాది పత్తి సాగుచేస్తున్న రైతులకు ఆదిలోనే హంసపాదు ఎదురయ్యేలా కన్పిస్తోంది. ఈ తొలకరిలో ముందుగానే కొద్దిపాటి వర్షాలు కురిశాయి. దీంతో తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు నాటారు. కానీ ఆ తరువాత నుంచి వర్షాలు మొఖం చాటేశాయి. అదే సమయంలో ఎండల వేడి మరి కొంత పెరిగింది. ఫలితంగా ఇప్పటికే వేసిన పత్తి మొక్కలు వాడిపోతున్నాయి.

40 శాతం విత్తనాలు మొలకెత్తనట్లేనా?

తిరుమలాయపాలెం మండలంలో పత్తి పంట సాధారణ సాగు విస్తీర్ణం 13,000 ఎకరాలు. ఈ ఏడాది ఇప్పటి వరకు 5,000 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. తొలకరి వర్షాల సమయంలోనే విత్తనాలు విత్తారు. కానీ ఆ తరువాత నుంచి వరుణుడు మొఖం చాటేశాడు. దీంతో విత్తనాలన్నీ ఎండిపోతున్నాయి. మండలంలో సుమారుగా 40 శాతం పత్తి విత్తనాలు మొలకెత్తలేదు. మరీ ముఖ్యంగా గడిచిన వారం రోజులుగా కొద్దిపాటి వర్షాలు కూడా కురవకపోవంతో పంట చేలన్నీ నెర్రెలువారుతున్నాయి. వాటిల్లోని పత్తి మొక్కలు వాడిపోతున్నాయి. దీంతో వరుణుడి కరుణ కోసం కర్షకులు కళ్లలో ఒత్తులేసుకుంటున్నారు. ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో వర్షపు జల్లులు కురవకపోతే పత్తి రైతులకు నష్టపోయే ప్రమాదం లేకపోలేదు.

రెండుమూడు రోజుల్లో వర్షం రాకపోతే కష్టమే..

వర్షాలు కురుస్తాయేమోననుకొని పత్తి విత్తనాలు నాటాం. ఆ రోజు నుంచి వాన జాడలేకుండా పోయింది. దీంతో నాటిన వాటిల్లో సగం విత్తనాలు మొలకెత్తలేదు. కొన్ని చోట్ల మొక్కలు మొలిచినా ఈ ఎండకు అవి మాడిపోతున్నాయి. మరో రెండుమూడు రోజుల్లో వర్షం రాకపోతే కష్టమే. మళ్లీ చేనును చెడగొట్టి మరోసారి అచ్చుతోలి పత్తి విత్తనాలు నాటాల్సి వస్తుంది. దక్కులు, కూళ్లు, విత్తనాలు కలిపి మొత్తం ఎకరానికి రూ.ఐదు వేల వరకూ నష్టపోవాల్సి వస్తుంది.

–యనగందుల సత్యం, రైతు, పిండిప్రోలు